క్లుప్తంగా

ఘనంగా సవరమ్మ జాతర



అమరచింత: పట్టణ శివారులో వెలసిన సవరమ్మ దేవత జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. సోమవారం ఆలయం ఎదుట పందిరి వేసి పూజలు ప్రారంభించిన ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఆలయంలోని మూల విరాట్‌లకు పవిత్ర జలాలతో అభిషేకం నిర్వహించారు. కుల, మతాలకు అతీతంగా గ్రామ దేవతగా పూజలందుకుంటున్న సవరమ్మ దేవతకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారికి కోళ్లు, కొబ్బరికాయలు నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి వస్తున్న భక్తులకు అసౌకర్యం కలుగకుండా నీటి వసతితో పాటు అమ్మవారిని ప్రత్యేకంగా దర్శించుకునే అవకాశం కల్పించామని నిర్వాహకులు వెంకటేశ్వర్‌రెడ్డి, సత్యారెడ్డి, అరేందర్‌రెడ్డి తెలిపారు.

జేపీఎస్‌ల ఉద్యోగాలు క్రమబద్ధీకరించాల్సిందే..



వనపర్తి: తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న నిరసనపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి తగదని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఎస్.చెన్నరాములు అన్నారు. మంగళవారం జేపీఎస్‌ల నిరసన శిబిరాన్ని సందర్శించిన ఆయన వారి దీక్షకు సంఘీభావం వ్యక్తం చేసి మాట్లాడారు. నాలుగేళ్ల ప్రొహిబిషన్ కాలంలో గ్రామాల్లో ఎంతో అంకితభావంతో పని చేసి రాష్ట్రానికి అవార్డులు తెప్పిస్తే.. వారి పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు తగదన్నారు. కార్యక్రమంలో ఘనపురం సర్పంచ్ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శులు కొంటిమోని మహేష్, చిట్యాల నరేష్ తదితరులు ఉన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



వనపర్తి: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన వనపర్తి క్రికెట్ లీగ్ టోర్నమెంట్‌ను పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి మంగళవారం ప్రారంభించారు. క్రీడలపై తనకున్న ఆసక్తి మేరకు టోర్నమెంట్ నిర్వహణకు సహకారం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పెద్దమందడి సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు సత్యారెడ్డి, పట్టణ నాయకులు సతీష్‌కుమార్, పెద్దమందడి సర్పంచ్ వెంకటస్వామి, నాయకులు తిరుపతయ్యయాదవ్, క్రికెట్ లీగ్ ఆర్గనైజర్లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.


జామె మసీదు కమిటీ ఎన్నిక

కొల్లాపూర్: పట్టణంలోని జామె మసీద్ కమిటీ అధ్యక్షుడిగా ఖాజా చావుష్ నియమితులయ్యారు. కమిటీ ఎన్నిక కోసం ముస్లిం మత పెద్దలు ముష్రఫ్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి అధ్యక్షుడిగా మహబూబ్‌అలీతో పాటు 9 మంది సభ్యులను నియమించారు. ముష్రఫ్ కమిటీ సభ్యులు మసీద్ కమిటీ అధ్యక్షుడిగా ఖాజా చావుష్, ప్రధాన కార్యదర్శిగా యాసిన్‌ను నియమించినట్లు మంగళవారం ప్రకటన ద్వారా వెల్లడించారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులకు మహబూబ్‌అలీ నియామక పత్రాలు అందించారు.

11న షిరిడీసాయి ఆలయ వార్షికోత్సవం

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని షిరిడీసాయి బాబ ఆలయ వార్షికోత్సవం 11న నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ బలరాం కృష్ణ మంగళవారం తెలిపారు. అదేరోజు ఉదయం సుప్రభాతసేవ, గణపతిసేవ, క్షీరాభిషేకం, సత్యనారాయణ వ్రతం, మధ్యాహ్నం మంగళహారతి, రాత్రి భజనలతో పల్లకీసేవా కార్యక్రమాలు ఉంటాయని అర్చకులు శివయ్య, ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.

స్వర్ణకారుల సంఘం సభ్యత్వ నమోదు



కొల్లాపూర్: స్వర్ణకారుల సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం పట్టణంలో చేపట్టారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రవీంద్రచారి మాట్లాడుతూ.. స్వర్ణకారులు తప్పనిసరిగా సభ్యత్వం తీసుకోవాలన్నారు. ప్రభుత్వం స్వర్ణకారుల సంక్షేమం కోసం చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేష్, యాదగిరి, వేణాచారి, వీరాచారి, నాగేంద్రచారి, రాము, కేశవాచారి, రమేష్ ఉన్నారు.

సత్తా చాటిన ఇంటర్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న వనపర్తి జాగృతి కళాశాల అధ్యాపక బృందం

వనపర్తి: ఇంటర్ రెండో సంవత్సరంలో స్థానిక జాగృతి జూనియర్ కాలేజీ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి జిల్లా టాపర్లుగా నిలిచారు. ఎంపీసీ విభాగంలో పి.కవిత 989 మార్కులు సాధించగా.. మరో విద్యార్థిని శ్రావణి 985, శృతి 984, సాధిక 984 మార్కులు సాధించారు. బైపీసీలో వైష్ణవి 988, సీఈసీలో ప్రవీణ్ 971 మార్కులు సాధించి జిల్లా టాపర్లుగా నిలిచారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ అంబటి వినోద్, యాజమాన్యం భాస్కర్, శ్యామ్, సత్యనారాయణ శాలువాలు కప్పి సత్కరించారు.

మొదటి సంవత్సరం ఫలితాల్లో స్కాలర్స్ ముందంజ

ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో స్కాలర్స్ కాలేజీ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి జిల్లా టాపర్లుగా నిలిచారు. బైపీసీలో 440 మార్కులకు గాను నందిని 434 మార్కులు, అరుణ 433 మార్కులు, ఎంపీసీలో 470 మార్కులకు గాను ప్రశాంతి 465, లావణ్య 464 మార్కులు సాధించారు. వీరిని ప్రిన్సిపాల్ శ్రీధర్, మధుసూదన్ గుప్త, డైరెక్టర్లు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ వరప్రసాద్‌రావు, నాగేశ్వర్‌రెడ్డి, డాక్టర్ సత్యనారాయణరెడ్డి శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు.

ఖానాపూర్ విద్యార్థిని ప్రతిభ

మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్‌కు చెందిన ఎరుకలి పద్మ, మొగిలన్నల కూతురు అఖిల గోపాల్‌పేటలోని కేజీబీవీలో చదువుతుంది. ఇంటర్ ఫలితాల్లో 970 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. ఈసందర్భంగా కౌన్సిలర్ చెన్నయ్య, ఖానపూర్ గ్రామస్తులు అఖిలను అభినందించారు.

పాన్‌గల్: ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ప్రైవేటుకు దీటుగా నిలిచారని కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాశంశెట్టి పేర్కొన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 89 మంది పరీక్షలకు హాజరుకాగా 65 మంది, ద్వితీయ సంవత్సరంలో 74 మంది పరీక్షలకు హాజరుకాగా 71 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో కిరణ్‌కుమార్ 880, స్వాతి 869, అఖిల 868 మార్కులు, బైపీసీలో మాసూమ్ 836, కళ్యాణి 805 మార్కులు, సీఈసీలో రాజు 822 మార్కులు, ప్రథమ సంవత్సరంలో సీఈసీలో తేజ 469 మార్కులు, బైపీసీ అంజలి 396 మార్కులు, హెచ్ఈసీలో కళ్యాణి 398 టాపర్లుగా నిలిచారు.


లింగేశ్వర్


కార్తీక్


కిరణ్‌కుమార్


నితిన్,


ఆనంద్


అఖిల


నందిని


ఇందు


వర్ష

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 9 శాతం, ద్వితీయ సంవత్సరం 27 శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు.

వీపనగండ్ల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరంలో 90.66 శాతం, ప్రథమ సంవత్సరంలో 54.25 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాంరెడ్డి తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో జానకీరాముడు 409 మార్కులు, నాగేశ్వరి 403 మార్కులు, బైపీసీలో ఎండీ నేహ 379, సీఈసీలో పూజిత 438, రజిత 387 మార్కులను సాధించారని, అలాగే ఇంటర్ రెండో సంవత్సరంలో ఎంపీసీలో కార్తీక్ 940 మార్కులు, సింధు 927, బైపీసీలో మమత 934, అనూష 886, సీఈసీలో లింగేశ్వర్ 863, అజయ్ 770 మార్కులు సాధించారు.

గోపాల్‌పేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో మౌనిక, మమత, శిరీష, రెండో సంవత్సరంలో భవాని, నరేష్, సుజాత ఉత్తమ మార్కులు సాధించారని అధ్యాపకులు తెలిపారు. బుద్దారం గురుకుల పాఠశాలలో మొదటి సంవత్సరం ఎంపీసీలో 94.87 శాతం, బైపీసీలో 95 శాతం, రెండో సంవత్సంలో ఎంపీసీలో వందశాతం, బైపీసీలో 95 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే గోపాల్‌పేట కస్తూర్బా కళాశాలలో మొదటి సంవత్సరంలో 96.36 శాతం, రెండో సంవత్సరంలో 80శాతం ఉత్తీర్ణత సాధించారు.

మదనాపురం: స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరంలో బైపీసీలో 33 మందికి 26 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఎంపీపీ 34 మంది విద్యార్థులకు 28 మంది ఉత్తీర్ణులయ్యారు. మొదటి సంవత్సరం ఎంపీసీ 32 మంది విద్యార్థులకుగాను 30 మంది బైపీసీ 33 మంది విద్యార్థులకు గాను 27 మంది ఉత్తీర్ణులయ్యారు.

ఇంటర్‌లో తగ్గిన ఉత్తీర్ణత

ఆత్మకూర్: స్థానిక ప్రభుత్వ కళాశాలలో గతేడాది కంటే మంగళవారం విడుదలయిన ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం తగ్గింది. ఈఏడాది ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 125 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 58 మంది, మొదటి సంవత్సరంలో 137 మందికిగాను 33 మంది ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపల్ రాజేశ్వర్‌రావు పేర్కొన్నారు. ఒకేషనల్‌లో సెకండియర్‌లో 70 మందికి 49 మంది, మొదటి సంవత్సరంలో 54మందికి గాను 26 మంది ఉత్తీర్ణులు అయ్యారు.

రాజ్యాంగ పుస్తకాలను పంపిణీ చేయాలి



పెద్దమందడి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న డీఎస్పీ నాయకులు

కొత్తకోట రూరల్: దేశంలో ఉన్న పౌరులందరికీ రాజ్యాంగ పుస్తకాలను ఉచితంగా అందజేయాలని ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) ఆధ్వర్యంలో మంగళవారం పెద్దమందడి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. దేశాన్ని నడిపిస్తున్న రాజ్యాంగం గురించి చాలా మందికి అవగాహన లేకనే పార్లమెంటరీ, ప్రజాస్వామ్యం విఫలమవుతుందని ఆందోళన చెందారు. సామాన్య ప్రజలు అవకాశాలు, అభివృద్ధిలో ముందడుగు వేసి ప్రధాన స్రవంతిలో కలవడానికి ప్రజలందరికీ రాజ్యాంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవగాహన కార్యక్రమాలు చేపట్టి రాజ్యాంగం గ్రంథం ఉచితంగా పంపిణీ చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు డీఎస్పీ డిమాండ్ చేసింది. కార్యక్రమంలో ఈశ్వర్, సూర్యప్రకాష్, శాంతన్న, కుర్మయ్య, శ్రీనివాసులు, సుధాకర్, భగవంత్, ప్రవీణ్‌కుమార్, కురుమూర్తి, రాములు తదితరులు ఉన్నారు.

వీపనగండ్ల: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు రాజ్యాంగంపై పూర్తి స్థాయిలో అవగాహన ఉండేందుకు అనువుగా రాజ్యాంగ గ్రంథాన్ని ప్రతి పౌరుడికి ఉచితంగా అందజేయాలని ధర్మసమాజ్‌పార్టీ నాయకులు మంగళవారం స్థానిక తహసీల్దార్ పాండునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. రాజ్యాంగంపై అవగాహన లేకపోవడం వల్లే ప్రజలు ఓటు విలువను గ్రహించలేకపోతున్నారని వాపోయారు. కార్యక్రమంలో డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య, కొల్లాపూర్ ఇన్‌చార్జ్ బాల్‌రాం, మండల అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు వీరస్వామి, ఎల్లస్వామి, నాగరాజు, శివ, రాఘవేంద్ర, అంజి, కిషోర్ అన్నారు.

వీధి విక్రయదారులకు బ్యాంకు రుణాలు



మేనేజర్‌కు దరకాస్తు పత్రాలను అందిస్తున్న మెప్మా కోఆర్డినేటర్

అమరచింత: ప్రధానమంత్రి ఆత్మనిర్భర్ కార్యక్రమంలో భాగంగా వీధి విక్రయదారులకు పీఎం స్వనిధి ద్వారా బ్యాంకు రుణాలను అందిస్తున్నామని మెప్మా కోఆర్డినేటర్ యువరాజ్ తెలిపారు. పట్టణంలోని యూకోబ్యాంక్ మేనేజర్ శివశంకర్‌ను మంగళవారం కలిసి రెండో విడత వీధి విక్రయదారులకు బ్యాంకు రుణాల కోసం దరకాస్తు పత్రాలను అందించారు. ఇది వరకు రుణాలను స్వీకరించి క్రమం తప్పకుండా రుణాలను సకాలంలో చెల్లించిన వారికి మరోమారు రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. రూ.పదివేలు రుణం కోసం నలుగురు, రూ.20 వేల రుణం కోసం 11 మంది, రూ.50 వేల రుణం కోసం ఏడుగురికి బ్యాంకు రుణం ఇవ్వనున్నట్లు తెలిపారు. బ్యాంకు మేనేజర్ చొరవ చూపి త్వరితంగా రుణాలను మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిమిస్తే చర్యలు



అమరచింతలో ఆటో డ్రైవర్‌ను హెచ్చరిస్తున్న సీఐ రత్నం

అమరచింత: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లఘించి ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకునే డ్రైవర్లపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీఐ రత్నం అన్నారు. పట్టణ శివారులో వాహనాల తనిఖీలో భాగంగా పరిమితికి మించి వ్యవసాయ కూలీలను ఎక్కించుకున్న ఆటోను నిలువరించి డ్రైవర్‌ను హెచ్చరించారు. అత్యాశతో ప్రయాణికులను ఎక్కించుకుంటే జరగరాని ప్రమాదం జరిగితే కోల్పోయిన వారి జీవితాలను వెనక్కి తీసుకురాలేమన్నారు. ఈమేరకు వ్యవసాయ కూలీలతో సీఐ మాట్లాడుతూ పొలాల్లో కష్టపడి పని చేస్తున్న మీరు ఇలా ఇరుఇరుకుగా ఆటోల ప్రయాణిస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ప్రైవేట్ వాహనాలను నడుపుతున్న డ్రైవర్లు కెపాసిటీకి మించి ప్రయాణికులను తమ వాహనాల్లో ఎక్కించుకున్నట్లు మరోమారు తమ తనిఖీలో కనిపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముస్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి



ఎమ్మెల్యేకు మొక్క అందిస్తున్న కమిషనర్ నాగరాజు

ఆత్మకూర్: స్థానిక మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన నాగరాజు మంగళవారం మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. ఈసందర్భంగా ఆత్మకూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని, సమస్యలు తలెత్తకుండ ఎప్పటికప్పుడు తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కమిషనర్‌తో పాటు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్ ఉన్నారు.

కమిషనర్‌కు సన్మానం

ఆత్మకూర్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన నాగరాజును బీజేపీ నాయకులు సన్మానించారు. మున్సిపాలిటీ అభివృద్ధిలో పాలు పంచుకుంటూ ప్రజలకు ప్రతినిత్యం అందుబాటులో ఉండాలని కోరారు. కార్యక్రమంలో అశ్విన్‌కుమార్, నాగేందర్, విజయ్, వెంకట్, సమద్, చందు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



తాటిపాములలో మృతదేహాలకు నివాళులర్పిస్తున్న చిన్నారెడ్డి

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములలో సోమవారం మృతి చెందిన చిన్నారుల కుటుంబ సభ్యులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి మంగళవారం జిల్లా ఆస్పత్రిలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి సంఘటన జరగడం చాలా బాధాకరమన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన గంధం కురుమన్న కుటుంబాన్ని ప్రభుత్వం తరపున అన్నివిదాలు ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయంతో పాటు 200 గజాల ప్లాటు, దళిత బంధు, డబుల్‌బెడ్‌రూం ఇల్లు, మిగిలిన ఇద్దరు చిన్నారులకు ఇంటర్ వరకు ఉచితంగా చదువుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మీడియా సెల్ జిల్లా కన్వీనర్ దాడి యోగానందరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

చిన్నారులు తిరుపతమ్మ, సంధ్య, దీపిక మృతదేహాలకు తాటిపాములలో మాజీ మంత్రి జిల్లెల చిన్నారెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్‌యాదవ్ స్థానిక నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాములుయాదవ్, నాయకులు అశోక్‌కుమార్‌రెడ్డి, ఎల్లస్వామి, గోవిందు, చందు, కురుమన్న , రంజిత్ నాయకులు పాల్గొన్నారు.

డీలర్లు సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ మల్లికార్జున్‌రావు

కోడేరు: డీలర్లు సమయపాలన ప్రకారం రేషన్ దుకాణాలను తెరిచి ఉంచాలని తహసీల్దార్ మల్లికార్జున్‌రావు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో డీలర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సరుకులు పక్కదారి పట్టకుండా చూడాలన్నారు. లబ్ధిదారుల నుంచి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. కొంత మంది లబ్ధిదారులు రేషన్ సరుకులు రెండు రాష్ట్రాల నుంచి తీసుకుంటున్నారని అన్నారు. వారికి రెండు కార్డులు ఉండటంతో రేషన్ బియ్యం రెండు రాష్ట్రాల్లో తీసుకుంటున్నారని అలాంటి వారు ఎవరైనా ఉంటే వారి పేర్లను తొలగించాలని డీలర్లకు సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ శ్రీనివాసులు, రమణ, శక్రు తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్ష విరాళం అందజేత

అడ్డాకుల: బలీదుపల్లిలో విగ్రహాల ప్రతిష్ఠ కోసం పెద్దమందడి ఎంపీపీ తూడి మేఘారెడ్డి రూ.1,01,116 అందజేశారు. గ్రామంలోని దేవాలయం వద్ద గణపతి, లోకేశ్వరస్వామి, సీతారాములు, కురుమూర్తిస్వామి, దీపస్తంభం, బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమాలు ఈనెల 14న చేపట్టనున్నారు. ఈ క్రమంలో నగదు అందజేసిన ఎంపీపీకి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ పద్మ, ఎంపీటీసీ గణేష్, సత్యారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

అడ్డాకుల: సైబర్ నేరాలపై అవగాహన అవసరమని అడ్డాకుల ఎస్ఐ మాధవరెడ్డి అన్నారు. మండలంలోని వర్నెలో మంగళవారం ప్రజలకు అవగాహన కల్పించారు. మొబైల్ ఫోన్లకు వచ్చే లింకులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దని, ఓటీపీలను ఎవరికీ తెలపవద్దని సూచించారు. మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. అదేవిధంగా గ్రామంలో బాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి స్మారకార్థం ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి

పాన్‌గల్: వైద్య సిబ్బంది తమకు కేటాయించిన ఆరోగ్య ఉప కేంద్రాల్లో నిరంతరం అందుబాటులో ఉండాలని పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆశా డే సందర్భంగా వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో వైద్య శాఖ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, పీహెచ్‌సీల ద్వారా అందిస్తున్న ఆరోగ్య కార్యక్రమాలపై ప్రజలకు వివరించాలన్నారు. పీహెచ్‌సీలో కాన్పులు చేయించుకుంటే అందించే ప్రోత్సహకాలు వివరించి ప్రతి గర్భిణి పీహెచ్‌సీలోనే కాన్పులు చేయించుకునేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. దీంతో పాటు గ్రామాల వారీగా నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరాలపై ఆరా తీశారు.

బీజేపీకి ప్రజాక్షేత్రంలో ఓటమి తప్పదు



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఫయాజ్

వీపనగండ్ల: ప్రజా సమస్యలను పట్టించుకోకపోగా మతం పేరుతో బీజేపీ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎండీ ఫయాజ్ అన్నారు. మంగళవారం బీజేపీ కో హఠావో దేశ్ కో బచావో నినాదంతో కల్వరాల, గోపల్‌దిన్నె, పుల్గర్‌చర్ల గ్రామాల్లో పార్టీ కార్యకర్తలతో కలిసి పాదయాత్రను నిర్వహించారు. నిత్యావసర వస్తువులు, డీజిల్, పెట్రోల్ ధరలు రోజురోజుకూ పెరిగిపోతున్నా నివారణ చర్యలు తీసుకోవడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని ధ్వజమెత్తారు. ప్రతి ఏడాది 2 కోట్ల మందికి ఉద్యోగాలు, రైతు ఖాతాలలో 15 లక్షలు జమ చేస్తామని చెప్పి మోదీ దేశ ప్రజలను మోసగించారని ఎద్దేవా చేశారు. అనంతరం వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించి తేమ పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, తుమ్మల శివుడు, కిరణ్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాళ్ల ప్రతిష్ఠాపనకు రూ.30వేల విరాళం



విరాళం అందజేస్తున్న అనుజ్ఞారెడ్డి

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని కంభాళాపురంలో శివాలాయం వద్ద గరడస్తంభం నిర్మాణానికి, మూడు రోజుల పాటు నిర్వహించే బొడ్రాళ్ల ఉత్సవాలకు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అనుజ్ఞారెడ్డి తమ వంతుగా రూ.30 వేలు విరాళాన్ని నిర్వాహకులు రాజవర్ధన్‌రెడ్డికి మంగళవారం అందజేశారు.

ఆర్థికసాయం..

ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని నాగసానిపల్లిలో బీజేపీ కార్యకర్త చరణ్‌కుమార్ ఇల్లు కూలిపోయింది. విషయం తెలుసుకున్న బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అనుజ్ఞారెడ్డి మంగళవారం చరణ్‌కుమార్‌కు రూ.20 వేలు ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే కాలంలో రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగరుతుందన్నారు. ఎప్పుడు ఎవరికి ఏ కష్టం వచ్చిన తనవంతు సహాయం అందిస్తానన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటస్వామి, విష్ణువర్ధన్, నాగరాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వేసవి అలవెన్స్‌లు చెల్లించాలి



కూలీలతో మాట్లాడుతున్న ఆంజనేయులు

వీపనగండ్ల: గ్రామీణ ఉపాధి పథకంలో పనిచేస్తున్న కూలీలకు అదనపు అలవెన్స్‌లను చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు అన్నారు. మంగళవారం గోవర్ధనగిరిలో ఉపాధి పనుల వద్దకు వెళ్లి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో గతేడాది పనిచేసిన 68 మంది కూలీలకు నేటికీ డబ్బులు అందలేదని ఆయన అన్నారు. ఆరు వారాలుగా గ్రామంలో ఉపాధి పనులకు వెళ్లిన కూలీలకు నేటికీ డబ్బులు చెల్లించకపోగా పే స్లిప్‌లను కూడా అందజేయలేదన్నారు. ఉపాధి కూలీ పథకాన్ని నిర్వీర్యం చేయాలన్న ఉద్దేశంతో గతేడాది రూ.93 వేల కోట్లు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం ఈ సంవత్సరం రూ.61 వేల కోట్లు మాత్రమే కేటాయించిందని మండిపడ్డారు. ఉపాధి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 16వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, అధిక సంఖ్యలో కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎండీ మౌలాలీ, రేవతమ్మ, ఖాజాబీ, పుల్లయ్య, చిన్నఖాజ, వీరయ్య, వెంకటమ్మ, బిజ్జన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఓసీ అందజేత



ఆత్మకూర్: మండలంలోని జూరాలకు చెందిన రాజయ్య కుమారుడు మల్లికార్జున్ అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నాడు. ఈ విషయం మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.లక్ష నిధులను మంజూరు చేయించారు. మంగళవారం ఎమ్మెల్యే నివాసంలో ఎల్ఓసీ కాపీని మల్లికార్జున్ కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్, జిల్లానాయకుడు మహమూద్ తదితరులు ఉన్నారు.

'కంటివెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



కంటివెలుగు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ వెంకటస్వామి, వైద్య సిబ్బంది

కొత్తకోట రూరల్: అంధత్వ రహిత తెలంగాణ ఏర్పాటే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పెద్దమందడి సర్పంచ్ వెంకటస్వామి అన్నారు. మంగళవారం పెద్దమందడి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు కార్యక్రమాన్ని ఆరోగ్య సిబ్బందితో కలిసి సర్పంచ్ వెంకటస్వామి ప్రారంభించారు. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని, అవసరం ఉన్న వారికి మందులు, అద్దాలను ప్రభుత్వమే ఉచితంగా అందిస్తుందన్నారు.

క్రీడలతోనే మానసికోల్లాసం

కోయిల్‌కొండ: మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను ఈ నెల 15,16,17 తేదీల్లో నిర్వహిస్తున్నామని, క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ శశికళ, జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మండలస్థాయి పోటీల్లో కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్, వాలీబాల్ తదితరాలు ఉంటాయన్నారు. 15– 36 సంవత్సరాల వయసు ఉన్న క్రీడాకారులు ఈ పోటీలకు అర్హులని వారు తెలిపారు. ఆసక్తి వారు ఈ నెల 10వ నుంచి 12వ తేదీలోపు ఆయా గ్రామాల పంచాయితీ కార్యదర్శులకు ఆధార్‌కార్డు జిరాక్స్‌తో పేరునమోదు చేయించాలని కోరారు. మండల ప్రత్యేకాధికారి మధుసూదన్‌గౌడ్, తహసీల్దార్ ప్రేమ్‌రాజ్, ఎంపీడీఓ జయరాములు, ఎంపీఓ శ్రీదేవి, ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్‌నాయక్ పాల్గొన్నారు.